బాగుపడే 'మార్గం' లేదా..?

- నానాటికీ అధ్వానంగా బీఎన్ రోడ్డు
- తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


పీడీ పాలెం కోఆపరేటివ్ భవనం వద్ద కోతకు గురైన తారురోడ్డు


బుదిరెడ్లపాలెం వద్ద బురదమయంగా మారిన తారురోడ్డు

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలు భయ భ్రాంతులకు గురౌవుతున్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే బీఎన్ రోడ్డుతోనే పనులు ప్రారంభిస్తామన్న కూటమి నేతలు గద్దె నెక్కి ఆరు నెలలవుతున్నా తారు రోడ్డు వేయకపోయిన కనీసం గోతులను పూడ్చలేదు. చోడవరం నుంచి బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట వరకు నాలుగు మండలాలను ఆనుకుని వెళ్తున్న బీఎన్ రోడ్డులో పెద్దపెద్ద గోతులు ఏర్పడి పలువురు ప్రమాదాలకు గురౌవుతున్నారు. ప్రతి రోజూ ఈ రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నా ఇక్కడ పాలకులు, అధికారులు చోద్యం చూడడంపై వేలాది మంది ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి రోడ్డును తలపించేలా...

బీఎన్ రోడ్డులో కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, గొల్లకొంపలు, పొట్టిదొరపాలెం, శంకరాపురం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల మధ్యన పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. పలు ప్రదేశాల్లో తారు మొత్తం ఊడిపోయి మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనాల రాకపోకల తాకిడికి బురద రోడ్లుగా మారి పంట దమ్ములను తలపిస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో మూడు నుండి నాలుగు అడుగుల లోతు వరకు తారుమట్టి ఊడిపోవడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి రోడ్డు అంచులు కోతకు గురై, కల్వర్టులు కూలిపోయి రోడ్డు మధ్యలో గోతులు పడ్డాయి.

పలు ప్రమాదాలు..

ప్రతి రోజు రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం, చోడవరం, బుచ్చెయ్యపేట తదితర మండలాల ప్రయాణికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది వాహనదారులు బి.ఎస్.రోడ్డులో రాకపోకలు సాగిస్తారు. ఇటీవల రావికమతానికి చెందిన ఒక వ్యాపారి కుటుంబ సభ్యులతో విశాఖ వెళ్లి తిరిగొస్తుండగా బంగారుమెట్ట, లోపూడి మధ్యన కూలిన కల్వర్టు గోతిలో కారు దిగిపోయి ప్రమాదానికి గురయ్యారు. కారు ముందు సీట్లో కూర్చున్న వ్యాపారి భార్య కారు అద్దాలకు తల తగలడంతో ఆమె తీవ్రంగా గాయపడగా కారు పూర్తిగా దెబ్బతింది. రోలుగుంట వద్ద ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందారు. ప్రతి రోజూ పలు వాహనాలు బుదిరెడ్లపాలెం, శింగవరం తదితర గ్రామాల వద్ద బురదలో కూరుకుపోయి ట్రాక్టర్లు, పొక్లెయిన్‌తో బైటకు లాగుతున్నారు. పలు వాహనాలు అదుపుతప్పి బోల్తాపడగా పలువురు గాయాలపాలవుతున్నారు.

స్పందించని కూటమి నేతలు

గతంలో చిన్నపాటి గోతులు ఏర్పడినా గోల చేసే కూటమి నేతలు ఇపుడు అధికారంలోకి వచ్చాక రోడ్డు దుస్థితిని పట్టించుకోకపోవడంపై వాహనదారులు మండి పడుతున్నారు. తక్షణం బీఎస్ రోడ్డులో గోతులను పూడ్చి రోడ్డును బాగు చేయకపోతే రోడ్డెక్కి ఆందోళనలు చేయడానికి యువత, కమ్యూనిస్టు పార్టీలు సిద్ధమౌవుతున్నారు. రోడ్ల బాగుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్అండ్‌బీ అధికారులు బీఎస్ రోడ్డు అభివృద్ధి గురించి నోరు మెదపడం లేదు. జిల్లా అధికారులైనా బీఎస్ రోడ్డు అభివృద్ధి గురించి శ్రద్ధ చూపాలని వేలాది మంది ప్రమాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

షాపు యజమానులు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న ఎస్ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ : కృష్ణదేవిపేట ప్రాంతంలో షాపు యజమానులు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ తారకేశ్వర్రావు తెలిపారు. ఆయన మంగళవారం షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాపులు మూసేసిన సమయంలో తాళాలు ఒకటి రెండు సార్లు వేశారా లేదా అనే పరిశీలించుకోవాలని కోరారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రతలు పాటించాలని తెలిపారు. ప్రతి షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలు అధికంగా ఉన్నందున ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు కలెక్టర్ వద్ద వెలుగు వీవోఏల ధర్నా


మాడుగుల వెలుగు కార్యాలయంలో నోటీసు అందజేస్తున్న వెలుగు వీఓఏలు

మాడుగుల రూరల్ : వెలుగు వీఓఎలు తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు వీఓఎలు హాజరు కావాలని జిల్లా వెలుగు వీఓఎల సంఘం ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మాడుగుల వెలుగు కార్యాలయంలో ఏపీఎంవో అప్పలనర్సమ్మకు ధర్నా నోటీసును వీవోఏలతో కలిసి అందజేశారు.

స్కౌట్స్ ఉత్తీర్ణులకు సర్టిఫికెట్ల ప్రదానం


స్కౌట్స్‌లో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన సిబ్బంది

బుచ్చెయ్యపేట : విద్యార్థులు స్కౌట్స్‌లో నైపుణ్యం సాధించిన వారికి అదనంగా కల్పించిన రిజర్వేషన్‌తో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ సోని తెలిపారు. మంగళవారం ఆమె వడ్డాది నేషనల్ టాలెంట్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న స్కౌట్స్ విద్యార్థులను ఆమె కలుసుకుని విద్యార్థుల విన్యాసాలను తిలకించారు. ఉన్నత చదువుతో పాటు స్కౌట్స్‌లో నైపుణ్యం సాధించిన వారికి ప్రభుత్వం మూడు శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. వడ్డాదిలో ఎన్టీఎస్‌లో స్కౌట్స్‌ని సమర్థంగా నిర్వహిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, స్కౌట్స్ కెప్టెన్ జగన్‌తో పాటు నైపుణ్యం సాధించిన విద్యార్థులను అభినందించారు.

మాజీ ప్రధాని ఇందిరకు ఘన నివాళులు


ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ ఇంఛార్జి కొండలరావు తదితరులు

మాడుగుల రూరల్:భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం మంగళవారం మాడుగులలో నిర్వహించారు. దొర్లవీధిలో గల ఇందిరా గాంధీ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుడబండి రాజు, ఏసురాజు తో పాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి చంద్రకళ, మహిళలు ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.

కె.కోటపాడు : దేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం చౌడువాడ శాఖా గ్రంథాలయం వద్ద జరిపారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలను వేసి గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి నివాళులు అర్పించారు. ఇందిరా గాంధీ ప్రధానిగా దేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు.

గొలుగొండ : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107 జయంతి వేడుకలు జోగుంపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ చిట్ల చలపతిరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్ల గంగరాజు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. చలపతి రావు మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూనలకు ఇందిరాగాంధీ పాటుపడ్డారని తెలిపారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించారని, ఆమె పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని కొనియాడారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంరం గ్రంథాలయ అటెండర్ వి.శృతి గ్రంథాలయాలు వాటి ఆవశ్యకత గురించి విద్యార్థులతో మాట్లాడించారు.

సీపీఎస్ ఉద్యోగుల 'చలో విజయవాడ'


పోస్టర్ ఆవిష్కరించిన ఉద్యోగులు

చోడవరం రూరల్ : సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు పరచి పూర్వపు పెన్షన్ పద్ధతిని కొనసాగించాలన్న డిమాండ్ సాధన కోసం వచ్చే నెల 10న నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని సీపీఎస్ ఉద్యోగ సంఘం తలపెట్టినట్టు సంఘం అనకాపల్లి జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.సింహాద్రప్పడు, జిల్లా కార్యదర్శి ఆర్.దేముడుబాబు తెలిపారు. మండలంలోని దుడ్డుపాలెం పాఠశాలలో సీపీఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహించి, చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పూర్వపు పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరారు. డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సీపీఎస్ ఉద్యోగులు తమ హక్కు కోసం విజయవాడలో పోరాడాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

పోరాటయోధుడు బిర్సా ముండా


బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు

నాతవరం : దివంగత నేత బిర్సాముండా సేవలు నేటి తరానికి తెలియజేసే బాధ్యత మనందరిపై ఉందని ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. బిర్సా ముండా 150 జయంతి వేడుకలు సందర్భంగా మండలంలో ఎం.బి.పట్నం చమ్మచింత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన బిడ్డ అయిన బిర్సా ముండా బ్రిటిష్‌వారు చేస్తున్న అరాచకాలు, అన్యాయాలపై ఎనలేని పోరాటం చేశారన్నారు. అంతటి మహనీయుడు జయంతి వేడుకలు కేంద్ర ప్రభుత్వం 2021 నుంచి అధికారంగా నిర్వహిస్తోందన్నారు. ఈనెల 15 నుంచి 26 తేదీ వరకు పలు గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించేందుకు అధికారులు కార్యచరణ రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు గోవిందు వెంకటలక్ష్మి సిహెచ్.ఎల్ పాత్రుడు, కాశపు శివరామప్రసాద్, అంబటి చంటిబాబు, కాశపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఐక్యంగా కార్తీక వన సమారాధనలు అభినందనీయం


కార్తీక వన సమారాధనలో భోజనం చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: గ్రామాల్లో ప్రజలంతా ఐక్యంగా కార్తీక వన సమారాధనలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలోని కన్నంనాయుడు గారి కల్లాలు, ఆర్యవైశ్యులు వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్న కార్తీక వన సమారాధనలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ వారితో కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు. ఆయన వెంట కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలం నాయుడు, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ లలితానాయుడు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రమణ, మాజీ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రమణ, పేరునాయుడు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి కల్పించుకోవాలి

చోడవరం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముందుకు నడవాలని జిల్లా సహకార శాఖాధికారి జి. సోమేశ్వరరావు అన్నారు. వికాస మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమావేశం చోడవరంలో మంగళవారం జరిగింది. మ్యాక్స్ సొసైటీ ఎండీ కోన సరోజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహిళలు, యువత , బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. డీసీఓ మాట్లాడుతూ మహిళలు మ్యాక్స్ ద్వారా ఉపాధి యూనిట్లు నెలకొల్పుకొని ప్రతి ఒక్కరూ ఉపాధి కల్పించుకోవాలన్నారు. పొదుపు ఆవశ్యకతపై మహిళలకు వివరించారు. మ్యాక్స్ సీఈఓ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షురాలు రమణమ్మ పాల్గొన్నారు.

ధీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి


ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహం వద్ద నివాళుల్పరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం : ప్రజల హక్కుల కోసం పోరాడిన వీర వనితలలో ఝాన్సీ లక్ష్మీబాయి ఒకరని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కొనియాడారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు రోడ్డులో ఉన్న లక్ష్మీబాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తవీధి నుంచి పెదబొడ్డేపల్లి వరకు 40 అడుగుల మేర రోడ్డు నిర్మించి, చెరువు వద్ద రోడ్డుకు ఇరువైపులా డా.బీఆర్.అంబేద్కర్, మహాత్మాగాంధీ, పటేల్, సుభాష్ చంద్ర బోస్, మదర్ థెరిస్సా, జ్యోతిరావు పూలే వంటి మహానుభావుల విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సన్యాసిపాత్రుడు, యర్రాపాత్రుడు, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, విజయ్, పాల్గొన్నారు.

నాతవరం : చమ్మచింత పాఠశాలలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రేయోభిలాషి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు నానాజీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పోరాట పటిమ కలిగిన మహిళా ధైర్యశాలి ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్ర అందరూ తెలుసుకోవాలన్నారు. నాయకులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

26న సీపీఎం మహాధర్నా

దేవరాపల్లి: రైతు, కార్మికుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. రైతు, కార్మికుల పట్ల ప్రభుత్వాలు అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ వాలాబు పంచాయతీ పరిధిలో మంగళవారం స్థానిక రైతులు, గిరిజనులతో కలిసి ఆందోళన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ 26న అనకాపల్లిలోని నెహ్రూ చౌక్‌లో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల సమావేశం

నాతవరం : మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం ఉదయం జరుగుతుందని ఎంపీడీవో కె.ఉషశ్రీ అన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో పాటు మండల స్థాయి అధికారులంతా విధిగా హాజరు కావాలన్నారు.

నీటితీరువా వసూలు చేయాలి

మాకవరపాలెం : నీటి తీరువా బకాయిలను వసూలు చేయాలని డీటీ సోమశేఖర్ వీఆర్వోలను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

రోలుగుంట: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయాధికారి వరలక్ష్మి మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులతో పాటు, కొవ్వూరు, కొమరవోలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండ గ్రంథాలయంలో మంగళవారం చోద్యం, జోగుంపేట, కస్తూర్బా కళాశాల బాలికలతో రంగవల్లిక పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ గొప్పతనం గురించి విద్యార్థులకు గ్రంథాలయ అధికారి రాజుబాబు తెలిపారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

మాడుగుల రూరల్ : శంకరం గ్రామ సచివాలయంలో అధికారులతో మంగళవారం సమావేశం జరిగింది. సర్పంచ్ శోలం రమేష్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి ఎం. నాగ శిరీష మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఎంపీడీవో అప్పారావు, హౌసింగ్ ఏఈ నాయుడు పాల్గొన్నారు.

సత్యసాయి వ్రతాలు

కె.కోటపాడు : కూండ్రపువానిపాలెం సత్యసాయి బాబా ఆలయంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సామూహిక సత్యసాయి వ్రతాలను మంగళవారం నిర్వహించారు. సత్యసాయి చిత్రపటం వద్ద గ్రామ సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, రాము, కన్నూరు సూర్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. వ్రతాల్లో గ్రామానికి చెందిన 80 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ నెల 23న జరగనున్న బాబా 99వ జయంతి కార్యక్రమాల్లో భాగంగా వ్రతాలు నిర్వహించినట్టు అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కొరెడ్డి అప్పలనాయుడు అన్నారు.

మేలైన బోధనతో సత్ఫలితాలు

రోలుగుంట : మేలైన బోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవరచాలని మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రైమరీ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని హెచ్ఎం శెట్టి మోహన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, మెనూ అమలు, బోధన, వెనకబడిన వారిని ఎలా తీర్చిదిద్దాలన్న అంశాలపై మాట్లాడారు.

అధిక యాంటీ బయోటిక్స్ వద్దు

చీడికాడ : పశువుల్లో వచ్చే జ్వరాలు, పొదుగు వాపు నివారణకు అధిక మొత్తంలో యాంటీబయోటిక్స్ వినియోగం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుందని మాడుగుల వెటర్నరీ సహాయసంచాలకుడు డా.వి.చిట్టినాయుడు అన్నారు. ప్రపంచ యాంటిమైక్రోబైల్ రిసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్జునగిరి ఆర్‌బీకేలో సర్పంచ్ బి.రమాదేవి అధ్యక్షతన రైతులతో సదస్సు నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు పశుగ్రాసం పెంచడానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను తెలిపారు. పశువైద్యులు కె.రాఘవమ్మ, ఎంపీటీసీ అమ్మతల్లి నాయుడు, రామునాయుడు(శేషు) పాల్గొన్నారు.

ఎఫ్‌పీవో సంఘం అధ్యక్షుడిగా నవరాజు

మాడుగుల: శ్రీమోదమాంబ ఎఫ్‌పీవో సర్వసభ్య సమావేశం మోదకొండమ్మ కళ్యాణ మండపంలో ఏపీఎం అప్పలనర్సమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా వియ్యపు నవరాజు, కార్యదర్శిగా వలసయ్య, కోశాధికారిగా అప్పలనాయుడు, 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కాగా ఎఫ్‌పీవో సీసీ ప్రసాద్ ఇక్కడ నుంచి బదిలీ కావడంతో సభ్యులు ఘనంగా సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్ రాణి, పార్థసారథి తదితరులు

నాతవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ గొలగాని రాణి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా పంచాయతీలో పనులు చేస్తున్న స్వీపర్లను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్డిని వినియోగించాలని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో 'మన మరుగుదొడ్డి-మన గౌరవం' పేరిట అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

రోలుగుంట: ప్రపంచ మరుగుదొడ్ల వినియోగ వారోత్సవాలు పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వర్రావు అధ్యర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాకవరపాలెం : తూటిపాలలో ప్రాథమికోన్నత పాఠశాలలో వరల్డ్ టాయిలెట్ డే నిర్వహించారు. హెచ్ఎం కె.రాము మాట్లాడుతూ ఆరుబయట మల, మూత్ర విసర్జనలను అరికట్టాలనే నవంబర్ 19న వరల్డ్ టాయిలెట్ డేగా పాటిస్తున్నట్టు విద్యార్థులకు వివరించారు.

















